క్లుప్తంగా

వాహనాల తనిఖీ



ఆత్మకూర్: ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో ఎస్ఐ నరేందర్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి స్థానిక గాంధీచౌక్‌లో ముమ్మరంగా డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించి పలువురిపై కేసులు నమోదు చేశారు. అలాగే వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా వాహనాల్లో నగదు తరలింపు, డ్రంకెన్‌డ్రైవ్, హెల్మెట్లు, ఆర్సీ, లైసెన్సు పరిశీలించారు. ఎన్నికల నియమావళి, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని వాహనదారులకు సూచించారు.

వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు



పాన్‌గల్: వ్యక్తి అదృశ్యమైన ఘటనపై మంగళవారం కేసు నమోదైనట్లు ఎస్ఐ వేణు తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ప్యాట శాంతయ్య కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 16వ తేదీ మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. అతని ఆచూకీ లభిస్తే పాన్‌గల్ పోలీసులకు, సెల్ నంబర్ 87126 70616 కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

బెల్లం ఊట ధ్వంసం



కొల్లాపూర్ (కోడేరు): మండలంలోని గుండ్యావాల్యానాయక్ తండా, సింగాయిపల్లి తండాలో మంగళవారం ఎక్సైజ్ సీఐ ఏడుకొండలు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. 600 లీటర్ల బెల్లం పానకం, 11 లీటర్ల సారాను గుర్తించి పారబోశారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మండలంలో ఎవరైనా సారా కాచినా, అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హామీలు నమ్మొద్దు

కొల్లాపూర్ (పెంట్లవెల్లి): బీఆర్ఎస్ ఇచ్చిన హామీలను నమ్మొద్దని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రజలను మాయ మాటలతో మభ్య పెడుతున్నారన్నారు. కొల్లాపూర్‌లో జూపల్లి కృష్ణారావును భారీ మెజార్టీతో గెలిపించుకుందామని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గోపినాయక్, కోట్ల సురేందర్‌గౌడ్, రామన్‌గౌడ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కొల్లాపూర్ (పెద్దకొత్తపల్లి): మారేడుమాందిన్నె గ్రామానికి చెందిన వజ్రాల దస్తగిరి ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందాడు. బాధిత కుటుంబానికి కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరంహర్షవర్ధన్‌రెడ్డి సమకూర్చిన రూ.15 వేలను మంగళవారం సర్పంచ్ గన్నోజు సునీతకృష్ణమాచారి అందజేశారు. కార్యక్రమంలో గాల్‌రెడ్డి, బాలయ్య, నారాయణ, నిరంజన్, మహేష్, శివ, రేణయ్య, జగన్, సాయిబాబు ఉన్నారు.

గుంతలమయంగా బీటీరోడ్డు

అడ్డాకుల: దాసర్‌పల్లి గ్రామం నుంచి దాని అనుబంధ గ్రామమైన చెన్నంపల్లి వరకు ప్రస్తుతం ఉన్న బీటీరోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. దాసర్‌పల్లి దాటిన తర్వాత చెరువు కట్టపై చాలా చోట్ల బీటీరోడ్డుపై గుంతలు ఉన్నాయి. ఇక్కడ గుంతల వల్ల వాహనాలు అదుపు తప్పితే చెరువులోకి దూసుకెళ్లే ప్రమాదం ఉంది. చెరువు కట్ట తర్వాత చెన్నంపల్లి వరకు రోడ్డుపై కంకర తేలడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉండగా మలుపుల వద్ద ఉన్న రోడ్డు గుంతల వల్ల వాహనాలు అదుపు తప్పుతున్నాయి. ఈ రోడ్డుపై చెన్నంపల్లితో పాటు నందిపేట గ్రామస్తులు రాకపోకలు సాగిస్తారు. నిత్యం ఆటోలు, ద్విచక్రవాహనాలు తిరిగే బీటీరోడ్డు పాడైనందున అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.





అమరచింతలో..



ఆత్మకూర్‌లో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో బతుకమ్మ పూజలు

దుర్గమ్మా.. కరుణించు తల్లీ



ఆత్మకూర్‌లోని నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న స్వర్ణకారుల మహిళలు

ఆత్మకూర్: దేవీశరన్నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా మంగళవారం అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. పట్టణంలోని నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో స్వర్ణకారులు, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, కోట్లాంజనేయస్వామి, అష్టలక్ష్మి ఆలయం, వాల్మీకినగర్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతిరోజు బతుకమ్మ పూజలు, బొడ్డెమ్మలు, సహస్రకుంకుమార్చన, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. పూజకార్యక్రమాల్లో ఎంపీపీ బంగారు శ్రీను, గాడికృష్ణమూర్తి, గాడీ లక్ష్మీనారాయణ, లక్ష్మణ్, శాంతాచారి, చైతన్య, వినయ్, డీకే రవి, విష్ణుచారి, జిన్నారం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు బహుమతుల ప్రదానం

నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో శృతి జ్యువెల్లర్స్ అధినేత గాడీ లక్ష్మీనారాయణ, అరుణ దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు నవరాత్రుల విశిష్టతపై పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన భక్తులకు ఎంపీపీ బంగారు శ్రీనివాసులు చేతులమీదుగా బహుమతులను ప్రధానం చేసారు.

అమరచింత: పట్టణంలోని ఆయా వార్డుల్లో కొలువైన అమ్మవారు గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పూజల్లో క్యామ రాములు, మేర్వరాజు, తాటికొండ రమేష్, మోదీ మనోహర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లి కన్యాకపరమేశ్వరీ ఆలయంలో మూడో రోజు అమ్మవారు అన్నపూర్ణ దేవిగా దర్శనమిచ్చారు. పూజల్లో ఆర్యవైశ్య సంఘం నాయకులు వీరన్నశెట్టి, రాంబాబుశెట్టి, నవీన్‌శెట్టి, శ్రీనివాసులుశెట్టి, మురళిశెట్టి, మాణిక్యం, వెంకటేష్ శెట్టి, శ్రీనుశెట్టి, మహిళలు పాల్గొన్నారు.

మదనాపురం: మండలంలో వివిధ మండపాల్లో కొలువైన శాకాంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

పెబ్బేరు రూరల్: మండల కేంద్రంలోని వాసవీకన్యకా పరమేశ్వరి ఆలయంలో గాయత్రీ దేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

వనపర్తి మండలంలోని నాగవరంలో..

నాగవరంలో మంగళవారం అమ్మవారు దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.



మదనాపురంలో..



పెబ్బేరులో..



కేతేపల్లిలో..

కార్మికులకు ఉచిత వైద్య శిబిరం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కార్మికులు

వనపర్తిటౌన్/పెబ్బేరు రూరల్: రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ వ్యవస్థాపకుడు పీజే థామస్ జ్ఞాపకార్థం మంగళవారం వనపర్తి పట్టణంలోని మున్సిపాలిటీ భవనం ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మున్సిపల్ కార్మికులు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ శిబిరంలో పారిశుద్ధ్య కార్మికులకు, సిబ్బందికి పీజే థామస్ కుమార్తె డా.తార భార్య చిన్నమ్మ థామస్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం రూరల్ డెవలప్మెంట్ సొసైటీ తరపున ఈ సేవా కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విక్రమసింహారెడ్డి, జిల్లా వైద్యాధికారి డా.రవిశంకర్, వైద్యులు చైత్యన్యకృష్ణగౌడ్, సిద్దార్థ్, అనిత, మురళీధర్, కిషోర్, ఉమామహేశ్వర్‌రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, పురపాలక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మానవపాడు: ఆరోగ్య మహిళా సమావేశంలో భాగంగా మంగళవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో డాక్టర్ రిజ్వానా తాన్విర్ ఆధ్వర్యంలో మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా ఆరోగ్య శిబిరంలో అందుతున్న సేవలు, సమస్యలపై పలు ఆరోగ్య సమస్యలను పరీక్షించారు. 61మంది మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, మహిళలకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యనారాయణ, చంద్రన్న, సంధ్యారాణి, తిరుమాల్‌రావు, ప్రసన్న, రాణి, కృష్ణవేణి, షాజహాన్, రేవతి, సోని, రసీదు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఏటీఎం ఏర్పాటు చేయాలని వినతి



మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కేతేపల్లి గ్రామస్తులు

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లిలో ఎస్‌బీఐ ఏటీఎం ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం గ్రామస్తులు, యువకుల ఆధ్వర్యంలో ఎస్‌బీఐ మేనేజర్ పవన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేతేపల్లితో పాటు చుట్టూ పక్కల 10 గ్రామాల ప్రజలు బ్యాంకు పరిధిలో సేవలు వినియోగించుకుంటున్నారన్నారు. దీంతో బ్యాంకు పరిధిలో ఏటీఎం లేకపోవడంతో నగదు కోసం బ్యాంకుకు లేదా, వనపర్తికి వెళ్లాల్సి వస్తుందన్నారు. దాదాపుగా 23 కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తుండటంతో బ్యాంకు పరిధిలోని వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బ్యాంకు అధికారులు స్పందించి వెంటపూ ఏటిఎంను ఏర్పాటు చేసి ఇబ్బందులు తొలగించాలని వారు వినతిపత్రంలో కోరారు. విషయాన్ని బ్యాంకు ఉన్నతాధికారులకు తెలియపర్చి సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని మేనేజర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ జైపాల్‌రెడ్డి, వార్డు సభ్యులు వెంకటేష్, మౌలాలి, యువకులు రాజశేఖర్, రాము, నాగర్జున్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిబద్ధతతో విధులు నిర్వహించాలి



పెబ్బేరులో పోలీస్ ఉద్యోగాలు సాధించిన వారిని సన్మానిస్తున్న నాయకులు



సందీప్‌గౌడ్‌ను సన్మానిస్తున్న కృష్ణయ్య

మదనాపురం: మండలంలోని అజ్జకొల్లులో ఇటీవల వెలువడిన కానిస్టేబుల్ ఫలితాల్లో ఉద్యోగం సాధించిన సందీప్‌గౌడ్‌ను మంగళవారం జెడ్పీటీసీ కృష్ణయ్యయాదవ్ పూలమాల, శాలువాతో సన్మానించారు. అనంతరం కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న వెంకట్రాంరెడ్డి, డ్రైవర్ శేఖర్‌ను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాములు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, శాంతమూర్తి, బ్రహ్మయ్య చారి, బోయిని శ్రీనివాసులు, యాదయ్య చారి, శ్రీనివాస్‌సాగర్, మక్బూల్, నరసింహాగౌడ్, వడ్డె శ్రీను, చెన్నారెడ్డి, ఇమామ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: ఇటీవల వెలువడిన కానిస్టేబుల్ పరీక్ష ఫలితాల్లో మండలంలో ఉద్యోగాలు సాధించిన ఆంజనేయులు, సుప్రజోస్న, సురేష్, ఉమామహేష్, కారుపాకుల వెంకటేష్‌లను యాదవ కమ్యూనిటీ భవనంలో మంగళవారం యాదవ సంఘం సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ వారు జీవితంలో ఎన్నో ఉన్నత శిఖరాలకు అధిరోదించాలని, ముందు తరాలకు ఆదర్శంగా నిలువాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ కర్రెస్వామి, కౌన్సిలర్ సుమతి, ఎల్లయ్య, కేతన్‌కుమార్, దర్గాప్రసాద్, మోహన్‌కుమార్, శ్రీకృష్ణ యాదవ సంఘం అధ్యక్షుడు తొండ వెంకటయ్య, నాగరాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నర్సింగాయపల్లిలో మద్యం సీజ్

గోపాల్‌పేట: మండలంలోని నర్సింగాయపల్లిలో మూడు కిరాణషాపుల్లో మద్యం అమ్ముతుండగా పోలీసులు దాడులు చేసి పట్టుకుని సీజ్ చేశారు. పసుపుల మహేశ్వరీ ఇంట్లో రూ.4,620 విలువ చేసే 13.4 లీటర్లు, బాల్‌రాజు ఇంట్లో రూ.4,350 విలువ చేసే 8.9 లీటర్లు, శ్రీనివాస్ ఇంట్లో రూ.1,870 విలువ చేసే 4.8 లీటర్ల మద్యం సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్‌గౌడ్, దామోదర్‌రెడ్డి, వంశీకుమార్, కానిస్టేబుల్ రాజేష్, హోంగార్డు రాములు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని ఆర్ గార్లపాడుకు చెందిన తెలుగు వెంకటేష్, ధర్మవరం గ్రామానికి శివరాంరెడ్డిలు అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో తనిఖీ చేశారు. వారి నుంచి 7.2 లీటర్లు (రూ. 5740 విలువ గల) మాద్యాన్ని అదుపులోకి తీసుకున్నట్లు కోదండాపురం ఎస్ఐ కృష్ణదేవా తెలిపారు. ఇటిక్యాల మండలంలోని చాగాపురం గ్రామానికి చెందిన చిట్టిబాబు అనుమతి లేకుండా బెల్టు షాపు నడుపుతూ మద్యం విక్రయిస్తుండడంతో పోలీసులు తనిఖీ 12 లీటర్ల రూ. 5270 విలువ గల మాద్యాన్ని అదుపులోకి తీసుకున్నట్లు ఇటిక్యాల ఎస్ఐ అశోక్ బాబు పేర్కొన్నారు.

రాత్రి వేళల్లో విష సర్పాలతో భయం

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని ముంపు గ్రామమైన నాగరాలలో రాత్రి, పగలు తేడా లేకుండా పాములు సంచరిస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో ఇంటి పరిసరాలకు వద్ద ఖాళీ ప్రదేశంలో పల్లె పకృతివనం ఏర్పాటు చేశారు. అది చెత్తా చెదారంతో పేరుకు పోకుపోవడం వలన పెద్ద, పెద్ద పాములు తమ ఇళ్లలోకి వస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్కడే చిన్నారులు ఆడుకుంటుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయాందోళనల మధ్య కాలం వెళ్లదీస్తున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తంచేశారు. వీలైనంత త్వరగా పార్కును ఇక్కడి నుంచి తరలించాలని స్థానికులు అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

అడ్డాకుల: సంకలమద్దిలో ఇళ్ల మధ్యన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. రేషన్ దుకాణం ఎదుట తక్కువ ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడంతో తీగలు కిందికి వేలాడుతున్నాయి. దీనివల్ల ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆడుకుంటూ చిన్న పిల్లలు దగ్గరికి వెళితే ప్రమాదం సంభవించే అవకాశం ఉందని తల్లిదండ్రులు వాపోతున్నారు. స్థానికంగా కొందరు పాడి రైతుల వద్ద ఉన్న పశువులు అటు వైపు నుంచి వెళ్లే సమయంలో ఒకరు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉండి వాటిని అక్కడికి వెళ్లకుండా చూడాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఎలాంటి రక్షణ కంచె ఏర్పాటు చేయలేదని.. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ప్రార్థన మందిరాల వద్ద సారా అమ్మకాలు



అమరచింతలోని రాజావళి దర్గా ఆవరణలో ఖాళీ సారా పాకెట్లు

అమరచింత: పట్టణ కేంద్రంలోని ప్రార్థన మందిరాల సమీపంలో అడ్డాలను ఏర్పాటు చేసుకొని సారా అమ్ముతున్నా సంబంధిత ఎక్సైజ్ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. రాజావళి దర్గా ఆవరణంలోని పరిసరాల్లో సారా సేవించి ఖాళీ పాకెట్లను అక్కడే పారవేయడంతో దర్గా పరిసరాలు అపరిశుభ్రంగా తయారవుతున్నాయి. శివాజీనగర్‌లోని నాగుల బావి వద్ద, మూడో నంబర్ బీడీ ఫ్యాక్టరీ వద్ద, బస్టాప్ రహదారిలో అడ్డాలను ఏర్పాటు చేసుకొని సారా అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటూ ప్రజల జీవితాలను నాశనం చేస్తున్నారు. సారాకు యువకులు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, సారా అమ్మకందారులపై చర్యలు తీసుకొని ప్రార్థన మందిరాల వద్ద విక్రయాలు జరగకుండా అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలి



సంతకాలు సేకరిస్తున్న నాయకులు

అమరచింత: ప్రైవేట్ రంగాల్లో ఎస్సీలకు రిజర్వేషన్లు కల్పించాలని కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. దళితుల రాజ్యాంగ హక్కుల సాధన కోసం 4న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సందర్భంగా మంగళవారం పట్టణంలో ఆయా సంఘాల ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా దళితుల సమస్యలు కేంద్రం దృష్టికి తీసుకుపోయే విధంగా రాష్ట్రపతికి కోటి సంతకాలు సేకరించి అందజేయనున్నట్లు వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారానికి ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో అజయ్, శ్యాంసుందర్, బుచ్చన్న, అరుణ్, సతీష్, రవికుమార్, ప్రకాశం, నిశాంత్, తిరుమతి శ్రీనివాసులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే



రేచింతలలో జలంధర్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

ఆత్మకూర్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరుతుందని, రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని రేచింతల, కత్తెపల్లి గ్రామాల్లో బీజేపీ నాయకులతో సమావేశమయ్యారు. నరేంద్రమోదీ సారథ్యంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని, బీజేపీ ప్రభుత్వంతోనే సుస్థిర పాలన సాధ్యమని స్పష్టం చేశారు. త్వరలోనే రానున్న ఎన్నికల్లో అధికార బీఆర్ఎస్‌కు, కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. మక్తల్ నియోజకవర్గంలో బీజేపీ గెలుపునకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రేచింతల శ్రీను, నాగేందర్‌రెడ్డి, గంగాధర్‌గౌడ్, శశిధర్‌రెడ్డి, చిన్ననర్సింహ, భాస్కర్, రంచంద్రయ్య, అనిల్, శేఖర్, సురేష్, మహేష్ తదితరులు ఉన్నారు.

అమరచింత: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థిని అఖండ మెజారిటీతో గెలిపించి నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగురవేద్దామని బీజేపీ రాష్ట్ర నాయకుడు జలేంధర్‌రెడ్డి అన్నారు. పట్టణానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు మీసాల శ్రీనివాస్‌తో పాటు మరికొందరు నాయకులు బీజేపీలో చేరగా.. వారికి కండువాలు కప్పి పార్టీలోని ఆహ్వానించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, అశోక్ కుమార్, భాస్కర్, నరాల నారాయణ, దుబాయ్ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి

కొల్లాపూర్ (పెద్దకొత్తపల్లి): బీజేపీతోనే యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు యేల్లేని సుధాకర్‌రావు అన్నారు. మంగళవారం పెద్దకార్పాములో యువత భరోసా యాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో యువతను మద్యం బానిసలుగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని ఆరోపించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బీమేష్, ఉపాధ్యక్షుడు మెరుగురాజు లింగస్వామి, శివ పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో తప్పులు దొర్లొద్దు

వీపనగండ్ల: ఓటరు లిస్ట్ తయారు చేసేటప్పుడు బీఎల్‌ఓలు జాగ్రత్త వహించినప్పుడే తప్పులు దొర్లకుండా ఉంటుందని తహసీల్దార్ వరలక్ష్మి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నూతన ఓటర్ నమోదు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని ఆమె బీఎల్‌ఓలను ఆదేశించారు. మరణించిన ఓటర్లు, డబల్ పేర్లు ఉన్న వారి వివరాలతో పాటు దివ్యాంగులు, 80 ఏళ్ల పైబడ్డ ఓటర్ల జాబితాలను తప్పులు లేకుండా తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీకాంత్, ఆర్ఐ కురుమూర్తి, బీఎల్‌ఓలు సుగణాబాయ్, కృష్ణమ్మ, పారిజాత, చంద్రకళ, మాధవి, సువర్ణ, ఎల్లమ్మ, జానకి పాల్గొన్నారు.

పత్తి పంటలపై ఇటుకల బట్టీల బూడిద

కృష్ణా: మండలంలోని నల్లగట్టు సమీపంలో గల ఇటుక బట్టీలతో రైతుల పంటలకు అపారనష్టం వాటిల్లుతుంది. గతకొంత కాలంగా రైతులు తమ ఇబ్బందులను తెలియజేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుతం పత్తి పంటల్లో బట్టీల బూడిద చేరడంతో తమ పంటలకు అపార నష్టం వాటిల్లుతుందని ఆ ప్రాంత రైతులు ఆరోపిస్తున్నారు. మంగళవారం గుడెబల్లూర్ రైతులు విలేకరులతో మాట్లాడుతూ ఇటుకల బట్టీలోని బూడిద మొత్తం గాలికి తమ పంటలపై చేరడంతో వరి, పత్తి పొలాల దెబ్బతిన్నాయని, సరైన ధరలు రాక ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. ఇటుకల బట్టీల యజమానులు తమతమ లాభాల కొరకు తమ పంటలకు నష్టం వాటిల్లుతుందని పలుమార్లు బట్టీల యజమానులకు, స్థానిక రెవెన్యూ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని, దీంతో తాము బాధిత రైతులతో కలెక్టర్‌కు త్వరలో ఫిర్యాదు చేస్తామని అన్నారు.

సరైన ధర రావడం లేదు

ప్రస్తుతం కాచిన పత్తిపై ఇటుకల బట్టీల బూడిద గాలికి వచ్చి పడుతుండడంతో మార్కెట్‌లో సరైన ధరలు రావడం లేదు. దీంతో తీవ్రంగా నష్టపోతున్నాం. ఈ విషయంపై అధికారులు పట్టించుకుని తమకు న్యాయం చేయాలి.

–రాము,
గుడెబల్లూర్, బాధిత రైతు